క్లుప్తంగా

గంజాయి, మాదక ద్రవ్యాలపై ప్రత్యేక దృష్టి



డీఎస్పీ భీమారావు

తొట్టంబేడు(రేణిగుంట): పట్టణంలో గంజాయి, మాదకద్రవ్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు డీఎస్పీ వి.భీమారావు తెలిపారు. కాకినాడ సబ్ డివిజన్ డీఎస్పీగా పనిచేస్తున్న ఆయన శ్రీకాళహస్తికి బదిలీపై వచ్చారు. బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న డీఎస్పీ కె.విశ్వనాథ్ విజయనగరం ట్రాఫిక్ డీఎస్పీగా బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ మాట్లాడుతూ, శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో పనిచేసే అవకాశం లభించడం సంతోషంగా ఉందన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ, క్రికెట్ బెట్టింగ్, ఆన్‌లైన్ జూదాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దేవస్థానానికి వచ్చే భక్తులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే స్పందనలో వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. నూతన డీఎస్పీని సీఐలు అంజూయాదవ్, విక్రమ్, విజయ్‌కుమార్, మల్లిఖార్జున్, వెంకటప్ప, ఎస్ఐలు తిమ్మప్ప, మహేష్, వెంకటేష్, రాఘవేంద్ర, ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఏఎంపురంలో మాతమ్మ తిరునాళ్ల



మాతమ్మకు అంబలి తీసుకువస్తున్న భక్తులు

సత్యవేడు: మండలంలోని ఏఎంపురంలో బుధవారం మాతమ్మ తిరునాళ్ల ప్రారంభమైంది. బుధవారం మాతమ్మ గుడికి మహిళలు అంబలి తీసుకువచ్చి పెద్ద పాత్రల్లో పోశారు. సాయంత్రం గెరిగ ఊరేగింపు నిర్వహించారు. మాతమ్మ భక్తులు కాపుకట్టి దీక్ష ప్రారంభించారు.

టెన్త్ ప్రతిభావంతులకు సన్మానం



టెన్త్ ప్రతిభావంతులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

నారాయణవనం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో జిల్లా టాపర్లుగా నిలిచిన షణ్ముగనాధన్, మౌనికలను బుధవారం ఘనంగా సన్మానించారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు షణ్ముగనాధన్ జిల్లాలో రెండో స్థానంలో, తమిళ మీడియం విద్యార్థిని మౌనిక పదవ స్థానంలో నిలిచారు. బుధవారం సాయంత్రం నారాయణవనం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వీరికి ఎంపీపీ దివాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సుదర్శనరెడ్డి శాలువలు కప్పి సత్కరించారు. సుదర్శనరెడ్డి, సర్పంచ్ శారద రూ 2 వేల చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు. వారు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు జిల్లా ర్యాంకులను సాధించడం వెనుక సీఎం జగన్ విజన్‌కు దర్పణం పడుతోందని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శివకంకర్, ప్రజాప్రతినిధులు రామన్, సారకాయలు, మోహన్, మనోహర్, ఢిల్లీబాబు తదితరులు పాల్గొన్నారు.

గంగజాతర సందడి



జాతరలో యువకుల వేషాలు

సత్యవేడు: 115ఏళ్ల ఘన చరిత్ర కలిగిన గంగ జాతర వేడుకలు బుధవారం రాత్రి సత్యవేడులో మొదలయ్యాయి. రెండ్రోజుల పాటు ఘనంగా నిర్వహించడానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని గ్రామ పెద్దలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి వేడుకలు సంబరంగా మొదలెట్టారు. జాతర సందర్భంగా యువకులు, పిల్లల వేషాలు ఆకట్టుకున్నాయి. వీధుల్లో సందడి చేశారు. ఇక వాహనాల రాకపోకలను పోలీసులు పూర్తిగా కట్టడి చేసి దారి మళ్లించారు. భారీ వాహనాలను పట్టణంలో రాకుండా కదూరు, ఊత్తుకోట వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. కంకర లారీలను దారి మళ్లించారు. జాతరకు భారీగా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ ఎస్.శివకుమార్‌రెడ్డి తెలిపారు.



పిల్లల విచిత్ర వేషాలు

పార్టీలకతీతంగా నవరత్న ఫలాలు

- చుక్కలనిడిగల్లు మాజీ సర్పంచ్ చుక్కల సాయమ్మకు రూ.1,55,477 పంపిణీ
- ఆమె కుమారుడు ఎస్సీసెల్ టీడీపీ నేతకు రూ.1,83,762 లబ్ధి
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



చుక్కల నిడిగల్లులో లబ్ధిదారునికి నమస్కరిస్తూ మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

రేణిగుంట: జగనన్న తీసుకొచ్చిన నవరత్న పథకాలు పార్టీలకతీతంగా కేవలం అర్హతే ప్రామాణికంగా పంపిణీ చేస్తున్నామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి మండలం చుక్కల నిడిగల్లులో బుధవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధి పొందిన వారితో మాట్లాడారు.

సాయమ్మకు సాయమిలా..

చుక్కల నిడిగల్లు మాజీ సర్పంచ్, టీడీపీ నాయకురాలు చుక్కల సాయమ్మకు వైఎస్సార్ రైతు భరోసా రూ.38, 500, వైఎస్సార్ సున్నా వడ్డీ రూ.5,801, వైఎస్సార్ ఆసరా రూ.31,176, వైఎస్సార్ పింఛను కానుక రూ.82వేలు.. మొత్తం రూ.1,55,477 ప్రభుత్వం నుంచి నేరుగా ఆమె ఖాతాలో జమ చేశారని బుక్‌లెట్‌తో ఆమెకు ఎమ్మెల్యే తెలియజేశారు. అలాగే ఆమె కుమారుడైన టీడీపీ ఎస్సీ సెల్ మండల నాయకుడు చుక్కల రమేష్ అలియాస్ ముద్దుకృష్ణకు వైఎస్సార్ వసతి దీవెన రూ.10వేలు, వైఎస్సార్ ఆసరా రూ.29,110, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ రూ.25,655, జగనన్న విద్యా దీవెన రూ.77,997, వైఎస్సార్ రైతు భరోసా రూ.40,500 మొత్తం రూ.1,83,762 లబ్ధి చేకూరిందని కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. అర్హత ఉన్నప్పటికీ పథకాలు లబ్ధి ఎవరికైనా అందనిపక్షంలో సాంకేతిక సమస్యలను పరిష్కరించి లబ్ధి చేకూరుస్తామన్నారు. గ్రామంలో సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చుక్కల కిరణ్, ఉప సర్పంచ్ ఎల్లయ్య, చుక్కల ధనకుమార్, రమణయ్య, మోహన్, వెంకటరమణమ్మ, మల్లికార్జున్ రాజు, చిరంజీవినాయుడు, లక్ష్మి, మహేష్, శివ, పిచ్చిరాజు, ఘనకుమార్, ప్రసాద్, నవీన్, బాలగున్నయ్య, పెంచలయ్య, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే ముందస్తు జన్మదిన వేడుకలు

రేణిగుంట: శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ముందస్తు జన్మదిన వేడుకలు బుధవారం రాత్రి శ్రీకాళహస్తి మండలం చుక్కలనిడిగల్లులో ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చుక్కల కిరణ్ ఆధ్వర్యంలో 52 కిలోల భారీ కేకును ఎమ్మెల్యే చేత కట్ చేయించారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



చుక్కల నిడిగల్లులో భారీ కేక్ కట్ చేసి చిన్నారులకు పెడుతున్న ఎమ్మెల్యే

పారదర్శకంగా పథకాలు



సాయినగర్‌లో ప్రభుత్వ పథకాల లబ్ధి పొందిన వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

పిచ్చాటూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో అర్హత కలిగిన ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అందిస్తున్నామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. బుధవారం మధ్యాహ్నం నాగలాపురం సచివాలయం-1 పరిధిలోని సాయినగర్, మిరపతోట ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల లబ్ధి పొందిన వారితో మాట్లాడారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

తమ గ్రామంలోని వీధులకు సిమెంటు రోడ్డు వేయించాలని, వీధి దీపాలు వెలగడం లేదని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సచివాలయానికి మంజూరయ్యే రూ.20 లక్షలతో సీసీ రోడ్లు వేయించడానికి ప్రతిపాదనలు పంపాలని ఎంపీడీఓ పద్మజ, ప్రజాప్రతినిధులకు సూచించారు. వీధిదీపాలు వేయాలని స్థానిక సర్పంచ్, కార్యదర్శులను ఆదేశించారు. మరికొందరు ఇళ్ల స్థలాలు, జగనన్న ఇల్లు, పెన్షన్ మంజూరు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో మండల వైఎస్ఆర్‌సీపీ కన్వీనర్ అపరంజిరాజు, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదొరై, సర్పంచులు పయణి, సచివాలయ మండల కన్వీనర్ మోహన్ మొదలి, ఏఎంసీ డైరెక్టర్లు కులశేఖర్ రెడ్డి, అలగేశన్, ట్రేడ్ యూనియన్ చైర్మన్ ఎస్ఎం సురేష్, నాయకులు మహేష్ రెడ్డి, శ్యామ్, పాల్ పద్మనాభం, డానియేల్, మురళి, దేశప్పన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పతకాలు సాధించిన క్రీడాకారులకు ఎమ్మెల్యే సన్మానం



ఏపీ సీఎం కప్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

రేణిగుంట: ప్ ఆధ్వర్యంలో తిరుపతి వేదికగా జరిగిన ఏపీ సీఎం కప్ రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో సత్తా చాటిన శ్రీకాళహస్తి విద్యార్థులను బుధవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. శ్రీకాళహస్తిలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థి బి.కరుణకుమార్ టెన్నిస్‌లో రజత పతకం, టేబుల్ టెన్నిస్‌లో ఆర్.ఝాన్సీ, పూజిత కాంస్య పతకాలను సాధించారు. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే క్రీడాకారులను, వారి కుటుంబ సభ్యులను, పీడీ వెంకటమునిని ఘనంగా సత్కరించారు. మున్ముందు మరిన్ని విజయాలను సాధించి శ్రీకాళహస్తికి, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, బియ్యపు పవిత్రారెడ్డి, బాలుర ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ ఆర్కాడు శంకర్, చిట్టివేలుజయగోపాల్, ఎత్తిరాజులు పాల్గొన్నారు.

ఏర్పేడును మరింత అభివృద్ధి చేస్తా

ఏర్పేడు: భవిష్యత్తులో ఏర్పేడును మరింతగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఏర్పేడులో ప్రధాన కూడలిలో పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. నూతన తాగునీటి బోరును స్విచ్చాన్ చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో మిగిలిన అర్హులను గుర్తించి, వారికి జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల స్థలాలు మంజూరు చేసి, పక్కా గృహాలు నిర్మించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. ఏర్పేడు పంచాయతీలో నూతన సిమెంట్ రోడ్లు, రెండు పంచాయతీ దుకాణాల గదుల నిర్మాణాలు, తాగునీటి బోర్లు, కొళాయిల ఏర్పాటు, మురుగునీటి కాలువల మరమ్మతులు చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు నాగార్జున రెడ్డి, సర్పంచ్‌లు జయముని, గంగాధరం, రాజ్యలక్ష్మి, నారాయణ, మునిరామయ్య, మాజీ ఎంపీటీసీలు రమణయ్య, మునిరత్నంరెడ్డి, నాయకులు లోకనాధరెడ్డి, హరినాధరెడ్డి, సయ్యద్ కరీముల్లా, ప్రభాకర్‌రెడ్డి, ప్రభు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల అవసరాలు తీర్చేలా మార్కెట్ యార్డ్

- నాగలాపురం ఏఎంసీ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ఆదిమూలం
- జూన్ 1 నుంచి పశువుల సంత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

పిచ్చాటూరు: రైతుల అవసరాలు తీర్చే విధంగా మార్కెట్ యార్డును తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఏఎంసీ కమిటీని ఆదేశించారు.. బుధవారం ఉదయం 11 గంటలకు నాగలాపురం ఏఎంసీ చైర్‌పర్సన్ వి.సునంద అధ్యక్షతన తొలి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాట్లాడారు. మార్కెట్ యార్డు అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తే మంత్రుల సహకారంతో నిధులు మంజూరు చేయిస్తానన్నారు. మార్కెట్ యార్డ్ ఆవరణలో ఆవులు, మేకలు, గొర్రెల సంతను జూన్ 1 నుంచి ప్రారంభించాలని సమావేశంలో తీర్మానించారు. ప్రస్తుతం ఉన్న మార్కెట్ యార్డు చెక్ పోస్టులతో పాటు అదనంగా వెంగళత్తూరు, పులికుండ్రం గ్రామాల వద్ద రద్దు చేసిన వాటినీ పునరుద్ధరించాలని ఏఎంసీ చైర్‌పర్సన్ కోరారు. ప్రస్తుతం ఉన్న నిధులతో ఏఎంసీ ఆవరణలో రైతులు ధాన్యం ఎండబెట్టుకోవడానికి కల్లం నిర్మాణం, కార్యాలయం మిద్దెపై సమావేశ మందిరం నిర్మాణం, మిగిలిపోయి ఉన్న ఏఎంసీ ప్రహరీ నిర్మాణాలు చేపట్టాలని సభ్యులు తీర్మానించారు. సమావేశంలో జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు కోనేటి సుమన్ కుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ జి.ఆనంద రెడ్డి, కార్యదర్శి గుణశేఖర్, సింగిల్‌విండో చైర్మన్ అపరంజిరాజు, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదొరై, పాల పద్మనాభం, ఎంపీపీ దివాకర్ రెడ్డి, ఏఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం జగనన్నను విమర్శిస్తే ఊరుకునేది లేదు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని విమర్శిస్తే తగిన బుద్ధి చెబుతామని టీడీపీ నేతలను ఎమ్మెల్యే హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే హేమలత నకిలీ కుల ధృవీకరణ పత్రంతో 2009లో ఎమ్మెల్యే అయ్యారని ఆరోపణలు పునరుద్ఘాటించారు. అంతేకాకుండా తమిళనాడు మాజీ మంత్రి విజయసారథి తన భర్త అని నకిలీ సర్టిఫికెట్ సృష్టించి అతనికి సంబంధించిన ఆస్తులను సైతం ఆమె కాజేసిందంటూ దీనికి సంబంధించిన రికార్డులను మీడియాకు చూపారు. అనంతరం నకిలీ సర్టిఫికెట్ వ్యవహారంపై తహసీల్దారు ప్రసన్నకుమార్‌కు ఎమ్మెల్యే ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో శ్రీ పళ్లికొండేశ్వరాలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, మండల వైఎస్ఆర్ సీపీ కన్వీనర్ అపరంజిరాజు, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు చిన్నదొరై, జిల్లా కార్యదర్శి తొప్పయ్య, నాయకులు శ్యామ్, మహేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు పట్టువస్త్రాల సమర్పణ



గంగమ్మకు పట్టువస్త్రాలు తీసుకువెళ్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, ఆలయ కమిటీ చైర్మన్

సత్యవేడు: సురుటుపల్లి పళ్లికొండేశ్వరస్వామి ఆలయం తరపున ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పట్టు వస్త్రాల సారెను సత్యవేడు గంగమ్మకు సమర్పించారు. బుధవారం సురుటుపల్లి ఆలయ కమిటీ సభ్యులు మునివేలు, ఆనంద్, సురేష్, ఆలయ ప్రత్యేక ఆహ్వానితులు బాల్‌రెడ్డి రాధాకృష్ణారెడ్డితో కలసి ఎమ్మెల్యే సత్యవేడు నడివీధి గంగమ్మకు సారెను అందజేశారు. తొలుత స్థానిక శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సురుటుపల్లి ఆలయ అర్చకులు లోకనాథ్ గురుకుల్. సతీష్ శర్మ పూజలు నిర్వహించారు. తదనంతరం ఆగమ శాస్త్ర రీత్యా మంగళ వాయిద్యాలు నడుమ ఎమ్మెల్యే, జాతర నిర్వాహకులు లాయర్ గోపినాథ్, సోమసుందరంశెట్టి, విజయనాయుడు, మురళికి పట్టువస్త్రాలు, పసుపు, కుంకుమ, 101 లడ్లు, గాజులు..మొదలైనవి సారెకు సంబంధించిన వాటిని అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి ఏటా సత్యవేడులో నిర్వహించే జాతరకు సురుటుపల్లి పళ్లికొండేశ్వరస్వామి ఆలయం ధర్మకర్తలు పట్టు వస్త్రాలను సమర్పించడం ఆనవాయితీ అని, వర్షాలు సమృద్ధిగా కురిసి, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని మొక్కినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పి.విజయలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ కే. సునీల్ కుమార్‌రెడ్డి, మాస్టర్ స్కూల్ చైర్మన్ కే.చంద్రశేఖర్ రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ బొప్పన సోమశేఖర్, లాయర్ పార్థిబన్, అపరంజిరాజు, ఎంపీటీసీలు శరవణ, బాలయ్య, పునిద కుమార్, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్లు వంశీరెడ్డి, ఎంపీ రవి, సర్పంచులు రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరికి గాయాలు

పెళ్లకూరు: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరికి గాయాలైన సంఘటన మండలంలోని జాతీయ రహదారి వద్ద జరిగింది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని పెన్నేపల్లెకు చెందిన అవరంబేటి ప్రసాద్ మేనకూరు సెజ్‌లోని ఓపరిశ్రమలో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో నాయుడుపేటలోని ఓప్లెక్సీప్రింట్‌లో పనుల నిమిత్తం మంగళవారం రాత్రి ఇంటి వద్ద నుంచి మోటారుసైకిల్‌లో నాయుడుపేటకు బయలుదేరాడు. మార్గం మధ్యలో జాతీయ రహదారి మలుపు వద్ద అతడిని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈఘటనలో అతడు తీవ్రంగా గాయపడి, అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు గుర్తించి క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నాయుడుపేటకు తరలించారు. అక్కడి వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ కృష్ణారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వం రైతుల పక్షపాతి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఉగ్గుమూడి సంధ్య

బుచ్చినాయుడుకండ్రిగ: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతుల పక్షపాతిగా తనదైన ముద్రతో రైతాంగం అభ్యున్నతికి పాటుపడుతోందని, అదే స్ఫూర్తితో మార్కెట్ కమిటీ పనిచేయాలని స్థానిక మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఉగ్గుమూడి సంధ్య అన్నారు. బుధవారం బుచ్చినాయుడుకండ్రిగ మార్కెట్ యార్డు కార్యాలయంలో సంధ్య అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, బుచ్చినాయుడుకండ్రిగ, కేవీబీపురం, వరదయ్యపాళెం మండలాల్లో రైతుల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కమిటీ కృషి చేయాలన్నారు. తిరుపతి ఎంపీ ఎం.గురుమూర్తి, ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సహకారంతో మార్కెట్ యార్డును అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామన్నారు. మార్కెట్ యార్డు ప్రహరీగోడ, కల్లాం మరమ్మతులు, మొదటి అంతస్తు నిర్మాణానికి పాలక మండలి తీర్మానించింది. సమావేశంలో వైస్ చైర్మన్ కే.సుబ్రమణ్యంరెడ్డి, సభ్యులు అంకమ్మ, చిన్నమ్మ, సుమలత, హరిబాబు, ఉమామహేశ్వరి, విద్యాసాగర్, కోటేశ్వరరావు, విజయ బుజ్జమ్మ, రమాదేవి, రత్నమ్మ, దశరథరామిరెడ్డి, వీరాస్వామి, ప్రభాకర్, కార్యదర్శి గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రంగునీటి కాలుష్యాన్ని నియంత్రించరూ!



హిందూ శ్మశాన వాటిక సమీపంలోని పరిశ్రమ నుంచి పారుతున్న రంగు నీరు

నారాయణవనం: నారాయణవనంలోని అద్దకం పరిశ్రమల నుంచి వెలువడే రంగునీటి కాలుష్యాన్ని నియంత్రించి, భూ, జల కాలుష్యం నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. నారాయణవనంలోని నూలు అద్దకం పరిశ్రమలు పదికి పైగా ఉన్నాయి. తమిళనాడు ప్రభుత్వం రసాయన రంగుల అద్దకాన్ని పూర్తిగా నియంత్రించింది. దీంతో తమిళనాడు సరిహద్దు ఉమ్మడి చిత్తూరు జిల్లాలకు రంగు అద్దకం కుటీర పరిశ్రమలకు డిమాండ్ పెరిగింది. నారాయణవనంలో రంగు పరిశ్రమలు ఈటీపీ ప్లాంటులు లేకుండా రంగునీటిని అరుణానదిలో వదిలేస్తున్నాయి. ఫలితంగా నదీ పరీవాహక ప్రాంతాల భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమయ్యాయి. స్థానిక హిందూ శ్మశాన వాటిక సమీపంలోని ఇటీవల తమిళనాడు ఈరోడ్ ప్రాంతం వారు ఏర్పాటు చేసిన అద్దకం పరిశ్రమ నుంచి మోతాదుకు మించి రసాయనాల రంగునీరు అరుణానదిలో కలుస్తోందని ఫిర్యాదులు అందుతున్నాయి. లైసెన్సులు లేని రంగు పరిశ్రమలను మూసివేయాలని గతంలో మండల సమావేశంలో తీర్మానం చేసినా సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో అరుణానదిలో కాలుష్యం ఎక్కువైందని పలువురు మండిపడుతున్నారు. ఇకనైనా రంగు పరిశ్రమల్లో ఈటీపీ ప్లాంట్లను ఏర్పాటు చేయించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ప్రతిభతోనే ఉత్తమ ఫలితాలు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తొట్టంబేడు(రేణిగుంట): విద్యార్థులు ఉత్తమ ప్రతిభతోనే మంచి ఫలితాలు సాధించారని హెచ్ఎం దామోదరం అన్నారు.బుధవారం మండలంలోని పెద్దకన్నలి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించి బహుమతులు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ మండలస్థాయిలో తమ స్కూలు విద్యార్థులు ఉషారాణి, వేణుచంద్రిక, గోపిక, పరిణీత, వెంకటసాయి అత్యధిక మార్కులు సాధించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవయ్య, లక్ష్మీప్రసాద్, చంద్రశేఖర్, సురేష్‌రెడ్డి, విజయశేఖర్, నాగేశ్వర నాయక్, శివకుమార్, మహాలక్ష్మి, విజయలక్ష్మి, మహాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టిరోడ్లకు మోక్షం



బీటీరోడ్డుగా మారిన కాంపాళెం మట్టి రోడ్డు

- సుమారు రూ.4 కోట్లతో 6 కిలోమీటర్లు మేర వేసిన రోడ్లు
- ఆనందం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: ఎన్నో ప్రభుత్వాలు మారినా పల్లె మార్గాలకు మోక్షం లభించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మట్టి రోడ్లను తారు, సిమెంట్ రోడ్లుగా మార్చి, సమస్యలను పరిష్కరిస్తానని ఎన్నికల సమయంలో కోనేటి ఆదిమూలం హామీ ఇచ్చారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో 72 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని మట్టిదారులు బీటీ, సిమెంట్ రోడ్లుగా మార్చడానికి ఎమ్మెల్యేగా ఆదిమూలం దృష్టి సారించడంతో వాటి రూపురేఖలు మారాయి. కుక్కంబాకం, కాంపాళెం, విజయగోపాలపురం, కరకంబట్టు, పూసలపల్లె, తహానగర్ గ్రామాల్లో మట్టి రోడ్డు వలన విద్యార్థులు, రైతులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వాటిని బీటీ, సిమెంట్ రోడ్లుగా మార్చడానికి సుమారు రూ. 4 కోట్లు మంజూరు చేయించి పనులు చేయించడంతో రవాణా సౌకర్యాలు మెరుగు పడ్డాయి.

ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం



ఎమ్మెల్యేగా కోనేటి ఆదిమూలం గెలిచిన వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చారు. ఆయనకు రుణపడి ఉంటాం. గుంతలమయమైన రోడ్లను బాగు చేయించారు.

- మునెయ్య, కరకంబట్టు

అభివృద్ధే ఆయన లక్ష్యం



ప్రజల అభివృద్ధే లక్ష్యంగా ఎమ్మెల్యే ఆదిమూలం సేవలు అందిస్తున్నారు. సమస్య చెబితే తక్షణం పరిష్కరించి ప్రజలకు అండగా నిలుస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా రోడ్ల సమస్యలను తీర్చారు.

- సుబ్రమణ్యం, కుక్కంబాకం

'అమర'లో శిశు సంరక్షణ ఐసీయూ ప్రారంభం



అమర ఆస్పత్రిలో శిశు సంరక్షణ ఐసీయూను ప్రారంభిస్తున్న డీఎస్పీ భవ్యకిషోర్

రేణిగుంట: మండలంలో కరకంబాడి సమీపంలోని అమర ఆస్పత్రిలో బుధవారం శిశు సంరక్షణ ఐసీయూ విభాగాన్ని బుధవారం డీఎస్పీ భవ్యకిషోర్ ప్రారంభించారు. డీఎస్పీ మాట్లాడుతూ, అత్యాధునిక సౌకర్యాలతో మహానగరాలకు దీటుగా ఇక్కడ ఆస్పత్రిలో నాణ్యమైన వైద్యసేవలు అందివ్వడం సంతోషకరమన్నారు. అమర ఆస్పత్రి ఎండీ డాక్టర్ రమాదేవి గొరినేని మాట్లాడుతూ, మాతా-శిశు మరణాలను నిరోధించడానికి అత్యవసర చికిత్సా విధానంతో చిన్నపిల్లలకు ప్రత్యేక ఐసీయూ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆస్పత్రి సీఏఓ వేణుగోపాల్, వైద్య నిపుణులు, సిబ్బంది పాల్గొన్నారు.